18న రాష్ట్ర క్యాబినెట్

పునర్విభజన సమస్యలపై చర్చించి తగు నిర్ణయం

జూన్ 2 తర్వాత ఎపికి కేటాయించిన భవనాలు స్వాధీనం

షెడ్యూల్ 9, 10 సంస్థల పంచాయతీపై ఆరా

ఉన్నత స్థాయి సమీక్షలో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ నెల 18న జరగనుంది. ఆ సమావేశంలో పునర్విభజనకు సంబంధించి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై బుధవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. జూన్ రెండు నాటికి రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉద్యోగుల కేటాయింపు మొదలుకుని ఆస్తులు, అప్పుల పంపిణీ వరకు పెండింగ్ అంశాలన్నింటిపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూలు 9, 10 లో ఉన్న సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించిన పంపిణీ, విద్యుత్తు సంస్థల బకాయిలు తదితర అంశాలపై ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలను అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వీలున్న ఉద్యోగుల బదిలీల వంటి చిన్న చిన్న అంశాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పీఠముడి ఉన్న అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ జూన్ 2 తర్వాత తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారనున్న నేపథ్యంలో ఎపికి కేటాయించిన భవనాలను అధీనంలోకి తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. పునర్విభజన చట్ట ప్రకారం పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో పంపిణీ చేసుకున్న వివరాలపై సమగ్రమైన నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

పుర్కాయస్థ విడుదలను స్వాగతిస్తున్నాం

- తెలంగాణ రైతు సంఘం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

న్యూస్‌క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ జైలు నుంచి విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం చట్ట విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. ఏడు నెలల క్రితం ఢిల్లీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఆయన అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని ఆయన లాయర్‌కు తెలపకుండా నేరుగా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచడం పట్ల కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసిందని తెలిపారు. చారిత్రాత్మక రైతు ఉద్యమ సమయంలో ఆయనపై కేంద్ర ప్రభుత్వం అనేక అభియోగాలు మోపిందని పేర్కొన్నారు. రైతుల పక్షాన న్యూస్‌క్లిక్ ప్రశంసనీయమైన, సాహసోపేతమైన పాత్రను పోషించిందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు నిస్సందేహంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశలో ఉన్నాయని తెలిపారు. న్యూస్‌క్లిక్‌పై ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన 7,400 ఛార్జ్‌షీట్‌కు వ్యతిరేకంగా ప్రబీర్ తన న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తున్న ఆయనకు తమ సంఘం పుర్కాయస్థకు అండగా ఉంటుందని తెలిపారు. స్వతంత్ర మీడియాను అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్న శక్తులపై ఆయన విజయం సాధిస్తారనే నమ్మకం తమకు ఉందని వారు తెలిపారు.

పత్తి ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతాం

• మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు కావాల్సిన పత్తి ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలో దాదాపు 60.53 లక్షల ఎకరాల్లో ప్రత్తి సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. అందుకు సరిపడా పత్తి విత్తనాలను ఈనెల చివరి నాటికి రైతులకు అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో పత్తి సాగుపై మంత్రి సమీక్షించారు. 2021లో 60.53 లక్షలు ఉన్న పత్తి విస్తీర్ణం క్రమంగా తగ్గుతూ 2023లో 45.17 లక్షలకు వచ్చిందనీ, అయినప్పటికీ ప్రపంచ మార్కెట్లో ఆ పంటకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం పెరిగే అవకాశముందని తెలిపారు. దానికి తగ్గట్టు పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించారు. గతేడాది 90 లక్షల ప్యాకెట్లు అమ్ముడుపోగా, ఈసారి 120 లక్షల ప్యాకెట్లను మార్కెట్లో ఉంచాలని సూచించారు. ఇప్పటికే రెండు దఫాలుగా సంబంధిత అధికారులు, విత్తన కంపెనీలతో సమావేశం జరిపి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కేంద్రప్రభుత్వం ఈసారి పత్తి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ.864గా నిర్ణయించిదనీ, ఏ ఒక్క డీలరైనా, అంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన సరఫరాలో ఇబ్బందులు సృష్టించే కంపెనీలను ఉపేక్షించబోమని అన్నారు. రైతుల ప్రయోజ నాలకు భంగం కల్గించే ఏ చర్యను తమ ప్రభుత్వం సహించబోదనీ, విధుల పట్ల అలసత్వం వహించే అధికారులపై కూడా చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేసుకుని, ఎప్పటికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ... నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అప్పుడు వద్దన్నారు.. ఇప్పుడు తెస్తున్నారు...

- అప్పులపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం
- రైతులను పట్టించుకోని సర్కార్ : కెటిఆర్ విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అసలు రుణాలే తీసుకోవద్దంటూ ఉచిత సలహాలిచ్చిన ఆ పార్టీ... ఇప్పుడు తన ఏలుబడిలో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తోందంటూ ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చెప్పేదొకటి, చేసేదొకటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నయవంచనే ఆ పార్టీ అసలు నైజమని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ హయాంలో ఎఫ్ఆర్‌బిఎమ్ నిబంధనలకు లోబడి రూ.3.89 లక్షల కోట్ల అప్పులను చేస్తే... దాన్ని రూ.ఏడు లక్షల కోట్లంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక... అసలు అప్పులెందుకు చేస్తున్నారో ఆ పార్టీ నేతలు చెప్పాలంటూ ప్రశ్నించారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న ఉప ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీకి ఆయా జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. ధాన్యం కొనుగోళ్లు స్తంభించిపోవటంతో వారు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. కామారెడ్డిలో ఇటీవల కొందరు రైతులు రోడ్ల మీదికి వచ్చారని గుర్తు చేశారు. మార్కెట్ యార్డుల్లో హమాలీల కొరత కూడా ఉందని చెప్పారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు. వరికి బోనస్, రుణమాఫీ తదితర అంశాల్లో రైతులకు తమ పార్టీ మద్దతుగా ఉంటుందని తెలిపారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకూ నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే... అన్ని సార్లూ తమ పార్టీయే గెలిచిందని కెటిఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు కూడా పట్టభద్రులు తమకే ఓటేస్తారంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. మెగా డిఎస్‌సి, జాబ్ క్యాలెండర్ విషయాల్లో కాంగ్రెస్ తన మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. టెట్ దరఖాస్తుల ఫీజును ఐదు రెట్లు పెంచిన ఘనత రేవంత్ సర్కార్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కేవలం ఆర్నెల్లలోనే 30 వేల ఉద్యోగాలిచ్చామంటూ ప్రభుత్వం చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్ సర్కార్‌కు ఆర్నెల్ల కాల పరిమితి పూర్తయింది... ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మరో ఆర్నెల్లలో రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఇది సాధ్యమేనా..? అని ప్రశ్నించారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థి... ఓ బ్లాక్‌మెయిలర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన్ను గెలిపిస్తే మరో నయింను గెలిపించినట్టేనని విమర్శించారు. ఇప్పటికే ఒక బ్లాక్‌మెయిలర్ (రేవంత్)ను చూశాం, ఇప్పుడు టీవీ ఛానళ్లను అడ్డం పెట్టుకుని బెదిరించే మరో బ్లాక్‌మెయిలర్‌ను గెలిపిద్దామా..? అని

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

కాంగ్రెస్‌కు ఒక్క సీటే..

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ఒకే ఒక్క లోక్‌సభ సీటుకు పరిమితం కాబోతోందనీ, అది కూడా నల్లగొండ నుంచే ఆ పార్టీకి అవకాశముందని కెటిఆర్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. బిజెపి గెలుపు కోసం సిఎం రేవంత్ ఎంతో కష్టపడ్డారనీ, అందులో భాగంగానే పలు స్థానాల్లో కాంగ్రెస్ నుంచి డమ్మీ అభ్యర్థులను రంగంలోకి దించారని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాత్రికేయులతో కెటిఆర్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆంధ్రాలో మళ్లీ జగనే అధికారంలోకి రాబోతున్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. నాగర్ కర్నూల్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, కరీంనగర్, ఖమ్మం, మెదక్, చేవెళ్ల లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ కచ్చితంగా గెలుస్తుందంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్ బస్సు యాత్ర తర్వాత కాంగ్రెస్, బిజెపి నేతలకు భయం పట్టుకుందని చెప్పారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ నేత వివేక్ ఇష్టానుసారంగా డబ్బులు వెదజల్లారని విమర్శించారు. తాను సిరిసిల్లలో వరసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాననీ, ఒక్కసారి కూడా ఓటర్లకు డబ్బు పంచలేదని తెలిపారు. సిఎం రేవంత్ ఇప్పటి నుంచి బూతులు మాట్లాడబోరనే విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా... 'అవునా...' అంటూ కెటిఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

యూనివర్సిటీల విసిల నియామకానికి ఇసి అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 10 విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతు (వైస్ ఛాన్స్‌లర్లు)ల నియామకానికి ఎన్నికల కమిషన్ అనుమతిచ్చింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే విసిల నియామకం జరుగుతుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. త్వరలో సెర్చ్ కమిటీల సమావేశం జరుగుతుందని చెప్పారు. విసిల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఉపకులపతుల మూడేండ్ల పదవీకాలం మే నెలాఖరుతో ముగుస్తుంది. ఈ క్రమంలో అర్హులైన ఆచార్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా పూర్తయింది. జెఎన్‌టియుహెచ్, ఓయు, కాకతీయ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు, మహాత్మా గాంధీ, తెలుగు, ఆర్కిటెక్చర్ (జెఎన్ఎఎఫ్ఎయు), అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీలను నియమించనున్నారు.

18 నుంచి సిపి గెట్ దరఖాస్తులు

- నోటిఫికేషన్ విడుదల
- ఉన్నత విద్యలో తెలంగాణ ముందంజ
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సిపి గెట్ దరఖాస్తులను ఈ నెల 18 నుంచి జూన్ 17వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సమర్పించుకోవచ్చని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆయన సిపి గెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సంప్రదాయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి పిజి ప్రవేశ పరీక్ష (సిపిగెట్–2024)కు రూ.500 ఆలస్య రుసుముతో జూన్ 25 వరకు, రూ.2 వేల ఆలస్య రుసుముతో జూన్ 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జూలై 5 నుంచి సిపిగెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ 294 కాలేజీల్లో 51 పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఉన్నత విద్యలో దేశ సగటు కంటే తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. సెర్చ్ కమిటీలో కోసం జిఒలు విడుదల చేశామనీ, త్వరలోనే యూనివర్సిటీల విసిల నియామక ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విసి రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. ఏ సబ్జెక్టులో డిగ్రీ చదివిన వారైనా .. సోషల్ సైన్సెస్, లాంగ్వేజెస్ కోర్సుల్లో పిజి చేసేలా నిబంధనలు సవరించడంతో ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక కోర్సులు చదివిన విద్యార్థులు సైతం సోషల్ సైన్సెస్‌లో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, సిపిగెట్ కన్వీనర్ ఐ.పాండురంగారెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వి.వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, వైస్ ఛాన్స్‌లర్లు మల్లేశం, గోపాల్‌రెడ్డి, ఒయు రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మండుటేసవిలో చల్లచల్లగా

- పలుచోట్ల వర్షపాతం నమోదు
- 42 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు
- రానున్న మూడు రోజులు

పలు ప్రాంతాలకు వర్ష సూచన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రతిసారీ మే నెలలో ఎండలు మండిపోతుంటాయి. కానీ, ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. మండుటేసవిలోనూ వాతావరణం చల్లగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షం పడుతుంది. బుధవారం ఉదయం 8:30 నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 55 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లా శంకరంపేట మండల కేంద్రంలో అత్యధికంగా 5.15 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 19 జిల్లాల్లో అక్కడక్కడా వర్షం పడింది. వచ్చే మూడు రోజులు పలు జిల్లాల్లో కొన్ని చోట్ల వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. ఆ జాబితాలో మెదక్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిర్మల్, నాగర్‌కర్నూల్, జనగాం, ఖమ్మం, నారాయణపేట, మంచిర్యాల, సంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ, సూర్యాపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలున్నాయి. వచ్చే 48 గంటల పాటు హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిచోట్ల ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడొచ్చు. గరిష్ట ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల వరకు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది. రాష్ట్రంలో బుధవారం ఒకటెండ్రు చోట్ల మాత్రమే 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల లోపే రికార్డయ్యాయి.

పాత బస్తీలో రిగ్గింగ్ జరగలేదు

- సోషల్ మీడియాలో వైరలవుతున్నది ఫేక్ వీడియో
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాతబస్తీలో రిగ్గింగ్ జరగలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. బహదూర్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో రిగ్గింగ్ జరిగిందంటూ సోషల్ మీడియాలో వైరలవుతున్నది ఫేక్ వీడియో అని ఆయన స్పష్టం చేశారు. తాము సాంకేతిక నిపుణులతో పరిశీలించిన మీదట ఈ వీడియో తెలంగాణ పార్లమెంట్, శాసన సభ లేదా మరే ఎన్నికకు సంబంధించింది కాదని తేలిందని పేర్కొన్నారు. కొంత మంది వ్యక్తులు కావాలని ఈ వీడియోను వైరల్ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగిందనీ, ప్రజలే ఇలాంటి పుకార్లను నమ్మవద్దని వికాస్‌రాజ్ పేర్కొన్నారు.

NOTICE

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI

A.S.No.195 /2017

Between:
Vemuri Girija Devi, W/o late Babu Rao, R/o. Dr.No.1-94, Pedaravuru(Vil), Tenali(Md),Gunturu Dt. ....Appellant

and

Vadlamudi Atchamamba, W/o.Late Ranga Rao, e/o. Visakhapatnam, rep. by General Power of Attorney agent her son Vadlamudi Ravi Prakash, S/o late Rangarao,(Plaintiff) and Others.. ..... Respondents

To,
R-4: Paladugu Venugopala Rao,S/o.late Seetharamaiah Chowdary, Retd. Employee in Vijaya Bank, R/o.Flat No.202, Manikonda Mansion, Nizampet Road, Kukatpalli, City Civil Courts Hyderabad(D4).

పై నెంబరు అప్పీలు దావాలో నాలుగవ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి అనేక పర్యాయాలు నోటీసులు పంపినను మీకు ముట్టనందున సదరు కోర్టు వారు ది.29-04-2024న ఐ.ఎ.నెం.1/2024 ద్వారా మీకు నోటీసు కొరకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.24-06-2014కి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని.లకు పై కోర్టు వారి యెదుట స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది.24-06-2024

K.H.V.SIVA KUMAR,
Advocate for Appellant,Guntur ,Cell:94903 43124

అక్కడ 'ఫైటింగ్'పై ఇక్కడ బెట్టింగ్

- ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో జోరుగా పందాలు
- జూన్ 4 నాటికి రూ.కోట్లలో సాగనున్న బెట్టింగ్
- ఖమ్మంలో కాంగ్రెస్ మెజార్టీ.. బిజెపి ఓట్లపైన కూడా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కాక పుట్టిస్తున్నాయి. అక్కడి ఎన్నికలపై ఇక్కడ జోరుగా బెట్టింగ్ సాగుతోంది. అధికార మార్పిడి ఉంటుందా? వైసోపా, టిడిపిల్లో ఎవరికెన్ని సీట్లు వస్తాయి? పెరిగిన ఓటింగ్ ఆ రాష్ట్రంలో ఎవరికి లాభిస్తుంది? పవన్ కల్యాణ్ పిఠాపురంలో గెలుస్తాడా? చంద్రబాబు కుప్పంలో గెలవటం ఖాయమేనా..? జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందా? ఇలాంటి అనేక అంశాలతోపాటు కొన్ని కీలక స్థానాలపైనా బెట్టింగ్ కొనసాగుతోంది. ఎపిపిసిసి అధ్యక్షులు షర్మిల గెలుపోటములపైన కూడా పందేలు కాస్తున్నారు. వృద్ధులు, మహిళలు, పేదలు, గ్రామీణ ప్రాంత ఓటింగ్ పెరగటం ఎపి ప్రభుత్వానికి సానుకూలమా? ప్రతికూలమా? అని కూడా ఆరా తీసి.. బెట్టింగ్‌కు దిగుతున్నవారూ ఉన్నారు. ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి కూడా సమాచారం సేకరిస్తుండడం గమనార్హం. తెలంగాణ లోక్‌సభ ఫలితాల కన్నా.. కేంద్రంలో అధికార మార్పిడికన్నా.. ఎపి ఎన్నికలపైనే సరిహద్దు ప్రాంతాల్లో చర్చ జరుగుతుండడం.. రాజకీయాలను ప్రతిష్టాత్మకంగా తీసుకునే వారు బెట్టింగ్‌లకు పాల్పడటం కనిపిస్తోంది.

మధ్యవర్తులు.. బాండ్ల రూపంలో..

రూ.5 వేలు మొదలు రూ.10 లక్షల వరకు సాగుతున్న ఈ బెట్టింగ్‌లన్నీ ముగ్గురు, నలుగురు ఓ బృందంగా ఏర్పడి పందేలు కాస్తున్నారు. విడివిడిగానూ పందేలు కాసే వారూ ఉన్నారు. డబ్బులున్న వాళ్లు మధ్యవర్తికి రూ.లక్షలు ముట్టజెప్పి బాండ్ పేపర్లపై సంతకాలు చేస్తూ.. సాక్షులతోనూ సంతకాలు చేయిస్తున్నారు. డబ్బులు లేనివారు రూ.లక్షల విలువ చేసే భూములు, ప్లాట్‌లను తాకట్టు పెట్టి మరీ పందేలు కాస్తున్నారు. బాండ్ పేపర్లు, ప్రాంసరీ నోట్ల మీద అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. ఇప్పటికే మొదలైన ఈ బెట్టింగ్ ప్రహసనం జూన్ 4వ తేదీ ఫలితాల వరకు సాగే అవకాశం ఉంది. అంటే దాదాపు రూ.కోట్లలో డబ్బులు మారే అవకాశాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఎగ్జిట్, ఒపీనియన్ పోల్స్ నిషేధించిన నేపథ్యంలో గతంలో సర్వేలు, పోలింగ్ సరళి, విశ్లేషకుల అంచనాలు, మీడియాలో కథనాల ఆధారంగా బెట్టింగ్ చేస్తున్నారు. ఎపిలో పరిచయమున్న జర్నలిస్టులు, రాజకీయ పరిజ్ఞానం ఉన్న ఆ రాష్ట్ర బంధుమిత్రులకు ఫోన్లు చేసి ఆరా తీస్తూ పందేలు కాస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నగరంతో పాటు సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలు, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో ఈ తరహా పందేలు ఎక్కువగా సాగుతున్నట్టు సమాచారం. అగ్రిమెంట్ చేసుకున్న బాండ్లను బయటపెట్టేందుకు మాత్రం ఇష్టపడటం లేదు. వాటిని చూపిస్తున్నారు కానీ ఫొటో తీసుకునేందుకు మాత్రం ఇవ్వట్లేదు. కొందరైతే పందెం ఓడినవాళ్లు స్నేహితులకు మందు, విందులు ఇవ్వాలనే ఒప్పందం కూడా చేసుకుంటుండటం గమనార్హం.

పార్టీ సొసైటీలు ఉన్నచోట మరీ ఎక్కువగా...

సామాజిక కోణంలో ఎపి.. పార్టీల వారీగా విడిపోయింది. అదే సంస్కృతి తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోనూ ఉంది. ముఖ్యంగా ఖమ్మం నగరంలోని కొన్ని కాలనీలు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గంలోని కొన్ని ఏరియాల్లో ఇది కనిపిస్తోంది. వేంసూరు, ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, కల్లూరు తదితర మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ తరహా పరిస్థితి ఉంది. అటువంటి చోట జగన్, వైసిపి ఫ్యాన్స్ ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని.. టిడిపి, జనసేన అభిమానులు ఎన్డీఏ కూటమికి పీఠం దక్కుతుందని పందేలు వేస్తున్నారు. పవన్‌కల్యాణ్, లోకేష్, చంద్రబాబు గెలుపోటములపైనా బెట్టింగ్‌లు పెడుతున్నారు. టిడిపికి వందకుపైన స్థానాలు వస్తాయని కొందరు అంటుంటే.. 2019 కన్నా కొన్ని సీట్లు తగ్గినా 100-130 స్థానాలతో మళ్లీ జగనే సిఎం అవుతారని పందేలు కడుతున్నారు. పార్టీ సొసైటీలున్న ప్రాంతాల నుంచి ఎపి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన అనేక మంది ఈ తరహా బెట్టింగ్‌లపై అమితాసక్తి చూపుతున్నారు. ఈ ఫలితాలపై కొందరు స్నేహితుల మధ్య కూడా మనస్పర్థలు, గొడవలు జరుగుతుండడం గమనార్హం. ముఖ్యంగా రెస్టారెంట్లు, మద్యం సిట్టింగ్‌ల వద్ద పొలిటికల్ డిస్కషన్స్ ఎక్కువగా జరిగి విభేదాలకు దారితీస్తున్నాయి. ఏపీలోని ఉమ్మడి కృష్ణ, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి అనేక మంది ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ తదితర జిల్లాల్లో స్థిరపడ్డారు. వీరు ఏపీ పరిస్థితులపై ఆరా తీసి.. అవసరమైతే అక్కడికి వెళ్లి తెలుసుకొని మరీ బెట్టింగ్ చేస్తున్నారు.

ఖమ్మం లోక్‌సభ మెజార్టీపైనా..

విచిత్రమేమంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది ఎపిలో వైసిపి గెలవాలని ఆకాంక్షిస్తుంటే.. మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఖమ్మం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు చెందినవారు 'కూటమి' గెలుపును కాంక్షిస్తున్నారు. ఈ గందరగోళ సమీకరణాల కారణంగానే మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో టిడిపి రెండు గ్రూపులుగా విడిపోయి ఒకటి బిజెపికి, మరొకటి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి రెండు లక్షలకు పైగా మెజార్టీ, లక్ష ఆధిక్యతతో గెలుస్తారని కూడా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. మధిర నియోజకవర్గంలో కొన్నిచోట్ల బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కొద్దిపాటి ఓట్లతోనైనా బయటపడతారని బెట్టింగ్‌లు పెడుతుండటం గమనార్హం. ఇక బిజెపికి వచ్చే ఓట్లపైనా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో 24వేల పైచిలుకు ఆ పార్టీకి వచ్చాయి. ఈసారి డిపాజిట్ దక్కుతుందని, దక్కదని కొందరు పందేలు పెడుతున్నారు. తెలంగాణ లోక్‌సభ ఎన్నికలపై బెట్టింగ్ మాత్రం నామమాత్రంగానే సాగుతోంది.

అంగన్‌వాడీ టీచర్ హత్య

• మెడలోని నాలుగు తులాల బంగారం, సెల్‌ఫోన్ చోరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్ హత్యకు గురైన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్–3లో రడం సుజాత (50) అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఆమె విధులు పూర్తిచేసుకొని తన స్వగ్రామమైన ఏటూర్ నాగారం మండలం చిన్న బోయినపల్లికి బయలుదేరింది. ఆ సమయానికి ఆర్‌టిసి బస్సు వెళ్లిపోవడంతో వేరే వాహనాల ద్వారా బయలు దేరినట్టు తెలుస్తోంది. బుధవారం ఉదయం నాంపల్లి అడవిలో నీళ్ల వొర్రె దగ్గరున్న పెద్దగుట్ట సమీపాన రోడ్డుకు అర కిలోమీటర్ దూరంలో ఆమె విగతజీవిగా పడి ఉంది. తునికాకు కూలీలు సుజాత మృతదేహం కనిపించడంతో స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి మెడకు స్కార్ఫ్ చుట్టి ఉరేసినట్టు, తల వెనుక భాగాన తీవ్రంగా గాయపరిచినట్టు గుర్తించారు. సుజాతకు చెందిన నాలుగు తులాల బంగారం, సెల్‌ఫోన్‌ను దుండగులు చోరీ చేయగా వివరాలు సేకరించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా కాటాపురంలో సుమారు 30 సంవత్సరాల నుంచి అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందింది. కాగా, ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె స్వగ్రామమైన చిన్నమైనపెల్లి, విధులు నిర్వహిస్తున్న కాటాపూర్ శోక సంద్రంగా మారింది. కాగా, హత్యకు పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులతో పాటు కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు పులి నరసయ్య గౌడ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి దావూద్, రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె సరోజన, కె సమ్మక్క, ఆశా యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు రత్నం నీలాదేవి డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST., AT: CHEVELLA
O.S. NO. 161 OF 2024

BETWEEN:-
Smt. Waheeda Shaheen and others ...Plaintiffs

And

1. The Tahsildar, Shankarpalli Mandal, R. R. Dist.
2. All Concerned ...Defendants

NOTICE

TO
All Concerned (D.2)

Please take notice that the above named Plaintiffs filed Suit for Declaration declaring the plaintiffs are the legal heirs and Successors of Sri Mohammed Shafiuddin, who died on 21-12-2018 i.e. open plot bearing no. 200, admeasuring area of 205 sq. yards, in sy.no. 352, 353, 403, 404 and 405, Situated in Gachibowli County at Kondakal Village and Grampanchayath, Shankarpally Mandal, Ranga Reddy Dist.

NORTH :: Land in sy.no. 405/Part
SOUTH :: 50 feet wide Road
EAST :: Plot No.199
WEST :: Plot No.201

The above case is posted on 14-06-2024 at 10:30 A.M., for your appearance. If you fail to appear before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absences as per law.

BY ORDER OF THE HON'BLE COURT
Sd/-
M/s. L.KRISHNA
Advocate,
Flat No. 302,
S.S. Apartments,
Near Shivaji Chowk,
Sainagar Colony, Chaitanyapuri,
Kothapet, Hyderabad- 68, T.S.
Cell : 9346724744

ఆశాలు, అంగన్వాడీల పట్ల చిన్న చూపు

- ఎన్నికల విధుల్లో కష్టపడ్డ మహిళలు
- బిఎల్ఒలుగా డ్యూటీ చేసినా దక్కని రెమ్యూనరేషన్
- రెమ్యూనరేషన్ పెంచాలన్న టీచర్లపై లాఠీఛార్జి
- ఆశాలు, అంగన్వాడీలకూ రెమ్యూనరేషన్ చెల్లించాలి - సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగడంలో అంగన్వాడీలు, ఆశాలు, ఆర్‌పిల పాత్ర ఎంతో కీలకమైంది. ఓటర్ల జాబితాలు, ఓటరు నమోదు, తొలగింపు, తప్పుల సవరణ, ఓటరు స్లిప్స్ పంపిణీ, పోలింగ్ శాతం పెంపునకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాదు, గ్రామ, బూత్ స్థాయిలో ఎన్నికల విధులన్నీ వీళ్లే చూశారు. చివరికి మే 13న పోలింగ్ రోజున కూడా ఆశాలు, అంగన్వాడీలు, ఆర్‌పిలకు బిఎల్ఒ డ్యూటీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన వైద్య సహాయం అందించారు. పోలింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మే 13న వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని సర్క్యులర్ జారీ చేసింది. అదే విధంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న వాళ్లందరికీ కూడా వేతనంతో పాటు రెమ్యూనరేషన్, టిఎ, డిఎ చెల్లించారు. అందరి కంటే ఎక్కువ రోజులు కష్టపడిన ఆశాలు, అంగన్వాడీలు, ఆర్పీలకు మాత్రం రెమ్యూనరేషన్ ఇవ్వకుండా వివక్ష చూపారు.

అధికారి క్రాంతి వల్లూరుకు వినతిపత్రం అందజేస్తున్న అంగాన్వాడీ, ఆశాలు

బిఎల్ఒ, హెల్త్ క్యాంపు డ్యూటీలు

పార్లమెంట్ ఎన్నికల విధుల్లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. వారితో పాటు అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఆర్‌పిలకు కూడా ఎన్నికల డ్యూటీ వేశారు. మే 13న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఆశాలు, అంగన్వాడీలు, ఆర్‌పిలు బిఎల్ఒలు, హెల్త్ క్యాంపు డ్యూటీలు చేశారు. పొద్దున ఐదు గంటల నుంచి రాత్రి ఇవిఎంలను తరలించే వరకు ఎన్నికల విధుల్లోనే ఉన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆశాలు, అంగన్వాడీలు, ఆర్పీలు 6200 మంది వరకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన 4097 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 30 వేల మంది ఆశా వర్కర్లు, 33,843 మంది అంగన్వాడీలు, పది వేల మంది ఆర్‌పిలు ఎన్నికల్లో విధుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించిన మాదిరిగానే ఆశాలు, అంగన్వాడీ, ఆర్‌పిలకు కూడా ఎన్నికల రెమ్యూనరేషన్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా చెల్లించలేదు. పని విషయంలో మాత్రం అందరి కంటే ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆర్‌పిలతోనే ఎక్కువ చేయించారు. ఎన్నికల పనిలో ఎక్కువ రోజులో ఆశాలు, అంగన్వాడీలే ఉన్నారు. అయినా వాళ్లకు ఇవ్వాల్సిన రెమ్యూనరేషన్ అందలేదు.

రెమ్యూనరేషన్ చెల్లింపులో వివక్ష

ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది, అధికారులకు రెమ్యూనరేషన్ చెల్లించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్ని రోజులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారో ఎంత దూరం వెళ్లి డ్యూటీ చేశారో దాన్ని బట్టి టిఎ,డిఎ చెల్లించారు. అందరు ఉద్యోగుల మాదిరే రాష్ట్రంలో ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆర్‌పిలు కూడా ఎన్నికల డ్యూటీల్లో పాల్గొన్నారు. ఎన్నికల రోజే కాకుండా నోటిఫికేషన్ రాక ముందు నుంచే ఓటర్ల నమోదు, జాబితాలు, చేర్పులు మార్పులకు సంబంధించిన పనులు చేశారు. కోడ్ అమల్లో కూడా వీళ్లే కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల రోజున డ్యూటీ చేసినందుకు కూడా ఇవ్వాల్సిన రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళల పట్ల వివక్ష చూపుతున్నారంటున్నారు. ఎన్నికల సంఘం, ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మాత్రం కొందరు అంగన్వాడీలు, ఆశాలకు మే 13కు సంబంధించి రూ.600 రెమ్యూరేషన్ చెల్లించారు. ఒకటి రెండు చోట్ల కాకుండా డ్యూటీలో పాల్గొన్న వాళ్లందరికీ రెమ్యూనరేషన్ చెల్లించాలని యూనియన్స్ డిమాండ్ చేస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు వినతి పత్రం అందజేశారు.

రెమ్యూనరేషన్ పెంచాలన్నందుకు టీచర్లపై లాఠీలు

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ పెంచాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. మే 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక రెమ్యూనరేషన్ ఇచ్చే విషయంలో టీచర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మే 11న కేంద్ర ఎన్నికల సంఘం పిఒ, ఎపిఒ, ఒపిఒలకు ఒకే విధమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని 691 సర్క్యులర్ జారీ చేసింది. ఇదే విషయాన్ని నారాయణఖేడ్‌లో పలువురు టీచర్లు అడిగినందుకు స్థానిక ఆర్‌డిఒ పోలీసుల్ని ఉసిగొల్పి లాఠీఛార్జి చేయించారు. పోలీసులు లాఠీఛార్జి చేయడం, ఆర్‌డిఒ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా టీచర్లు నిరసన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్డీఓ, సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

డ్యూటీ చేసిన వాళ్లందరికీ రెమ్యూనరేషన్ ఇవ్వాలి: వరలక్ష్మి, ఆశా యూనియన్ (సిఐటియు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి డ్యూటీ చేసిన ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆర్‌పిలందరికీ రెమ్యూనరేషన్ చెల్లించాలి. రెమ్యూనరేషన్ చెల్లించడంతో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆశాలు, అంగన్వాడీలు, ఆర్‌పిలకు ఇవ్వాల్సిన డబ్బుల్ని వెంటనే చెల్లించాలి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం : పరమేశ్వర్, సంగారెడ్డి కలెక్టరేట్ ఎఒ

ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, ఆర్‌పిలకు రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరుతూ రిప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి ఎన్నికల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఇసి మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

రోడ్డుపై బైఠాయించిన రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులు

ధాన్యం కొనుగోళ్లపై జాతీయ రహదారి దిగ్బంధనం

- పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతులు బుధవారం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధించారు.. కాంటా వేయడంతోపాటు వెంటనే మిల్లులకు తరలించాలని యాదాద్రిభువనగిరి జిల్లా బిబినగర్ మండలం గూడూరు రైతులు రాస్తారోకో చేశారు. దీంతో జాతీయ రహదారిపై గూడూరు టోల్ ప్లాజా వరకు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న బిబినగర్ తహసీల్దార్ శ్రీధర్, భువనగిరి రూరల్ సిఐ రవీందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను గురువారం నుంచి ప్రారంభిస్తామని, తూకంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని, రైతులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తూకం వేసిన ధాన్యాన్ని, లారీల్లో తరలించిన ధాన్యాన్ని మిల్లర్ల వద్ద అన్‌లోడ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు.

రాజన్న సిరిపిల్ల జిల్లాలో

రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం మల్కపేట గ్రామ రైతులు ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఒకవైపు అకాల వర్షాలకు వడ్లు తడిసి ముద్దవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగడం లేదని, మరోవైపు వర్షాకాలం సమీపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సుమారు గంటకు పైగా ధర్నా నిర్వహించడం వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు అక్కడి చేరుకుని లారీల కొరత ఉందని, లారీల కొరత తీర్చి వెంటనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

రిమ్స్‌లో పేషెంట్ కేర్ ఆత్మహత్యాయత్నం

- సూపర్‌వైజర్ వేధింపులే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం రిమ్స్‌లో పేషంట్ కేర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున రిమ్స్‌లోనే ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. గమనించిన సిబ్బంది వెంటనే ఐసియు వార్డుకు తరలించారు. సూపర్‌వైజర్ బెదిరింపులు తట్టుకోలేకనే ఆమె ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు కార్మిక సంఘాల నాయకులు, రిమ్స్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్‌రాథోడ్ రిమ్స్‌కు ఘటనా స్థలానికి వచ్చి సమీక్షించారు. మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఈ ఘటనపై కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులపై బెదిరింపులకు పాల్పడుతున్న సూపర్‌వైజర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం లక్ష్మి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. ఘటనపై త్రిసభ్య కమిటీతో విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ.. కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ నుంచి సూపర్‌వైజర్లను నియమించాలన్నారు. లక్ష్మి కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించడంతో పాటు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

నిధులిచ్చినా ఖర్చు చేయని ఎంపిటిసిలు

- నిజాంపేటలో రూ.7.36 లక్షలు మిగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు సేవ చేస్తామని.. ఎన్నికల్లో ఎన్నో వాగ్దానాలు చేస్తారు స్థానిక ప్రజాప్రతినిధులు. తీరా అమలులోకి వచ్చేసరికి ప్రభుత్వం వారికిచ్చే నిధులతో ఎలాంటి పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తారు. దీనికి నిదర్శనమే సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలంలో ఎంపిటిసిలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోవడమే. 2023-24 సంవత్సరానికి గాను 15వ ఫైనాన్స్ నిధుల కింద నిజాంపేట మండలానికి రూ.8,64,712 మంజూరయ్యాయి. ఎంపిటిసిల పదవీకాలం ముగియడానికి సమయం దగ్గర పడుతున్నప్పటికీ అందులో నుంచి రూ. 1,28,201 నిధులను మాత్రమే ఖర్చు చేసి పనులు చేపట్టారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం కేవలం డ్రయినేజీలు, మంచినీటి పైపులైన్ల కు మాత్రమే ఈ నిధులను వినియోగించు కోవాలి. కానీ నిధులను సద్వినియోగం చేయకపోవడంతో మంజూరైన నిధుల్లో

రూ.7,36,511 మిగిలిపోయాయి. ఎప్పుడో చేయవలసిన పనులను నేటికీ మొదలు పెట్టకపోవడమే నిధులు మురిగి పోవడానికి కారణమని పలువురు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ అనంతరం ఎంపిటిసిలు తమకు మంజూరైన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేసి పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. వారికి కార్యాలయాలు కేటాయించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం షురూ

- కాంగ్రెస్‌లో జోష్.. బిఆర్ఎస్‌కు ఎదురీతే..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈనెల 13వ తేదీన పార్లమెంటు ఎన్నికలు ముగియగానే పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రచారంలో వేగం పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బిఆర్ఎస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి, బిజెపి అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిను ఆయా పార్టీలు ఖరారు చేయడం, వారందరూ నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఒకవైపు పార్లమెంట్, మరోవైపు పట్టభద్రుల నియోజకవర్గ ప్రచారాన్ని సైతం కాంగ్రెస్ అన్ని పార్టీల కంటే ముందే ప్రారంభించింది. గత ఎన్నికల్లో ఇక్కడ ఎమ్మెల్సీగా ఎన్నికైన బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దాంతో పట్టభద్రుల నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఇప్పటికే ఈ నియోజకవర్గంలో రెండుసార్లు పోటీ చేసి గట్టి పోటీనిచ్చారు.

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలో ముందస్తుగానే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి బి ఫారం అందజేయడంతో నామినేషన్‌ను సైతం అందరి కంటే 'తీన్మార్' ముందే దాఖలు చేశారు. గత రెండు ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోటీ చేసి విశేష ఆదరణను పొంది ప్రత్యేక గుర్తింపు పొందిన తీన్మార్ మల్లన్నకు పార్టీ బలంతోపాటు, జర్నలిస్టుగా గుర్తింపుతోపాటు గత రెండు ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి సైతం కలిసొచ్చే అవకాశముంది. దీంతో ఈసారి గెలుపు సునాయసమవుతుందన్న విశ్వాసంలో తీన్మార్ అనుచరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులున్నాయి. ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో ఈ ఎన్నికను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నారు. ఎమ్మెల్యేల బలం తగ్గిపోవడంతో బీఆర్ఎస్‌కు ఎదురీత తప్పడం లేదు.

కమలం పోటీనిచ్చేనా..?

బిజెపి గ్రాఫ్ బాగా పెరిగిందన్న ప్రచారం నేపథ్యంలో మరోమారు ఈ నియోజకవర్గంలో బిజెపి తన బలాన్ని పరీక్షించుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంది. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అభ్యర్థిగా రంగంలోకి దించింది. హన్మకొండ జిల్లాకు చెందిన 'గుజ్జుల' గతంలో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. గత ఎన్నికల్లో బిజెపి తన అభ్యర్థిగా ఎర్రబెల్లి రామ్మోహన్‌రావును రంగంలోకి దించినా ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు. ఈ ఎన్నికల్లో మళ్లీ 'గుజ్జుల'ను రంగంలోకి దించడం గమనార్హం.

పసికందు మృతి
వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందాడు. అయితే, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితులు ఆరోపించారు. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన శిరీష పురిటి నొప్పులతో బాధపడుతూ మంగళవారం రాత్రి వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. వైద్యురాలు మాధవీలత ఆమెకు ఆపరేషన్ చేసి మగ బిడ్డను బయటకు తీశారు. కాగా శస్త్ర చికిత్స సమయంలో శిశువు బొడ్డు పేగు బయటకు రావడంతో దాన్ని కత్తిరించడం వల్ల పసికందు మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చని పోయిందని బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం వైద్యులు సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రియను వివరణ కోరగా.. అప్పుడే పుట్టిన బిడ్డల్లో కొందరికి అరుదుగా బొడ్డు బయటకు వస్తుంటుందని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- పొగగొట్టమెక్కి 'ట్రైడెంట్' కార్మికుని ఆందోళన
- యజమాన్యంతో చర్చలు జరిపిన కలెక్టర్, కార్మికశాఖ అధికారులు
- సమస్యను పరిష్కరిస్తామన్న హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ వేతనాలు చెల్లించాంటూ ట్రైడెంట్ పరిశ్రమలో మరోమారు నిరసనలు చెలరేగాయి. వేతనాల విషయంలో పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యహరిస్తోందని, తమ కుటుంబ పోషణ దినదిన గండంగా మారుతున్నదని ఇదివరకే పలుమార్లు కార్మికులు ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో తాజాగా.. రవి అనే ఓ కార్మికుడు బుధవారం పరిశ్రమలోని బాయిలర్ పొగగొట్టం పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన చేపట్టాడు. దాంతో అధికార యంత్రాంగం దిగొచ్చి జిల్లా కలెక్టర్.. పరిశ్రమ యజమాన్యంతో ఫోన్ ద్వారా సంప్రదించగా.. వచ్చే సోమవారం కల్లా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. దాంతో

పొగాకు గొట్టం ఎక్కి నిరసన తెలుపుతున్న కార్మికుడు

ఆందోళన విరమించారు. పొగగొట్టం పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకోబోయిన కార్మికుడు రవి.. కూతురు వివాహం ఈ నెల 17న జరగనుంది. ఈ నేపథ్యంలో డబ్బులకు ఇబ్బందులు ఎదురవడంతో.. ఆందోళనతో అతను పొగగొట్టం ఎక్కి నిరసన తెలిపాడు. అంతేకాకుండా మరో కార్మికుని కూతురు వివాహం కూడా ఈనెల 21వ తేదీన ఉన్నది. దాంతో వారూ ఆందోళన బాట పట్టారు. అయితే వారిద్దరి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెల్లించేందుకు యజమాన్యాన్ని ఒప్పించినట్టు ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, కార్మిక నాయకులు రాములు యాదవ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు రాములు, రవి నర్సింలు మాట్లాడుతూ.. 2023 నుంచి కార్మికులకు చెల్లించాల్సిన వివిధ రకాల బకాయిలను యాజమాన్యం చెల్లించక పోవడంతో తమ పరిస్థితి దినదిన గండంగా మారిందన్నారు. యజమాన్యం మాటలు విని ప్రతిరోజూ క్రమం తప్పకుండా పరిశ్రమకు వచ్చి వెళుతున్నామని, అయినా జీతాలు మాత్రం ఇవ్వట్లేదని తెలిపారు. దాంతో కుటుంబ పోషణ భారంగా మారుతున్నదన్నారు. ఈ పరిశ్రమపై కార్మికులతో పాటు సుమారు 4000 మంది రైతులు ఆధారపడి ఉన్నారని, వారందరి జీవితాలతో ఆడుకోకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమలో క్రషింగ్ కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అక్కడికి వచ్చిన నాయకులు, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి కార్మికుడికి నచ్చజెప్పి.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో మాట్లాడి ఇద్దరు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు. మరోపక్క పరిశ్రమకు కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో రావడంతో.. వారిని అదుపు చేసేందుకు ఎసిఎల్ డిసిఎల్ అధికారులతో పాటు సిఐ, ఎస్ఐ, వివిధ పార్టీల నాయకులు చేరుకొని వారికి నచ్చజెప్పారు. పరిశ్రమకు వచ్చిన వారిలో.. కార్మికులతో పాటు జహీరాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నర్సింహా రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జగదీశ్వర్, కరణ్, ఎంపిటిసిలు, కార్మిక సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లెక్కలమీద లెక్కలు.. అయోమయంలో నేతలు

- సామాజిక తరగతుల వారీగా ఓటింగ్‌పై కసరత్తు
- బిఆర్ఎస్ ఓటు ముంచేదెవరినో?
- ఇంటలిజెన్స్ వర్గాలకు సైతం అంతుచిక్కని ఓటరు నాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్నిరోజులు ప్రచారపర్వంలో మునిగితేలిన నేతలు ఇప్పుడు గెలుపోటముల అవకాశాలపై లెక్కలేసుకుంటున్నారు. లెక్కల మీద లెక్కలేసుకుంటున్నా అంతుచిక్కని ఓటరు నాడితో నేతలు అయోమయంలో పడ్డారు. తేల్చుకోలేక సతమతం అవుతున్నారు. సైలెంట్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందో అన్న భయాందోళనలకు గురవుతున్నారు. కెసిఆర్ బస్సు యాత్రతో జనాల కదలికను బట్టి బిఆర్ఎస్ కూడా రంగంలో ఉన్నదన్న సంకేతం బలంగా వెళ్లింది. ఏమైందో ఏమోగానీ చివరి రెండు రోజుల్లో కథంతా మారిపోయింది. ఇప్పుడు చాలా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు సొంత పార్టీ క్యాడర్ కూడా ఓటెయ్యలేదనే చర్చ నడుస్తున్నది. బీఆర్ఎస్ నుంచి బదిలీ అయిన ఓటు తమ కొంప ఎక్కడ ముంచుతుందో అన్న హైరానాకు కాంగ్రెస్, బిజెపి నేతలు గురవుతున్నారు. ఏడెనిమిది నియోజకవర్గాల్లో ఓటింగ్ ఒన్‌సైడ్ జరిగి గెలుపోటములు ఎవరిదనే అంచనాకు ఇంటలిజెన్స్ నిఘా వర్గాలు వచ్చాయి. కానీ, మిగతా వాటిలో ఏంటనేది తేల్చడం కష్టంగా మారింది. గెలుపోటములు నిర్ణయించే మార్జిన్ ఐదు శాతం లోపే ఉండటంతో స్వింగ్ ఓటు ఎటువైపు మరలిందనేది తేలటం లేదు. ఎవరి వైపు మొగ్గు చూపారో చెప్పడానికి ఓటర్లు కూడా ఇష్టపడట్లేదు. దీంతో నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళి ఏంటి? ఏయే ప్రాంతాల్లో ఎక్కువ పోలింగ్ నమోదైంది? అక్కడి స్థానిక పరిస్థితులు ఎవరికి అనుకూలంగా ఉన్నాయి? సామాన్య ప్రజలు ఏమనుకుంటున్నారు? ఎవరి వైపు ఓటర్లు మొగ్గు చూపారు? అనే దానిపై ఆయా వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఇంటలిజెన్స్ అధికారులకు కూడా ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. ఓటర్లకు తెలియకుండానే వారు ఎవరివైపు మొగ్గుచూపారనే దాన్ని రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు పిచ్చాపాటి మాట్లాడుకోవడంపైనా దృష్టిపెట్టారు. 'రాష్ట్రంలో పోలింగ్ సరళిని బట్టి చూస్తే తొమ్మిది నియోజకవర్గాల్లో నెక్ టూ నెక్ ఎన్నికలు జరిగాయి. ఆ నియోజకవర్గాల్లో పోటీ హోరాహోరిగా ఉంది. ఎవరు గెలిచినా తక్కువ మెజార్టీతో గెలిచే అవకాశముంది. ఈ విషయం ఉన్నతాధికారులకు చెబితే అస్సలు ఒప్పుకోవడం లేదు. ఈ విషయం అందరూ చెబుతారు. ఎవరికి గెలుపు అవకాశాలున్నాయనే విషయంపై కచ్చితత్వంతో తెలుపండి అంటూ వారు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం ఓ రౌండ్ తిరిగాం. అయినా, ఓ నిర్ధారణకు రాలేకపోయాం. ఈ రోజు మరోసారి నియోజవర్గం మొత్తం మళ్లీ ఆరా తీస్తున్నాం' అని ఓ ఇంటలిజెన్స్ అధికారి చెప్పడం కొసమెరుపు. వారంతా హోటళ్లు, పార్కులు, ఆయా ప్రాంతాల్లోని చౌరస్తాల్లో యువత నుంచి పండు ముసలి వరకు కనిపించిన వారినల్లా ఓటు ఎవరికి వేశారనే అంశంపై ఆరా తీస్తున్నారు.

బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు కూడా ఓటింగ్ సరళిపై పోలింగ్ కేంద్రాల వారీగా సమీక్షించుకుంటున్నారు. ఆ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? ఎవరెవరు ఓటేశారు? ఆ ఓటు ఎక్కడ పడే అవకాశముంది? యువత ఏమనుకుంటున్నారు? గ్రామాలు, పట్టణాల్లోని తమ సామాజిక తరగతి వారు ఓటు వేశారా? లేదా? ఏయే అంశాల్లో వెనుకబడ్డాం?' ఇలా అన్ని అంశాలపై గ్రామం, బూతు వారీగా నేతలను పిలిపించుకుని అభ్యర్థులు లెక్కలు తీస్తున్నారు. చాలా చోట్ల బిఆర్ఎస్ ఓటింగ్ తమ వైపు మొగ్గుచూపిందనీ, జాతీయ అంశాలు, దేశభద్రత, మోడీ హవాతో తమ పార్టీకి అధిక సీట్లు వస్తాయని బిజెపి అభ్యర్థులు ఆశల్లో తేలియాడుతున్నారు. గ్రేటర్‌లో పోలింగ్ శాతం గత ఎన్నికలతో పోలిస్తే పెరిగినప్పటికీ అంతిమంగా ఇంచుమించు 50 శాతం వరకే నమోదు కావడం వారిని కలవర పెడుతున్నది. మొన్నటి ఎన్నికల్లో బిఆర్ఎస్ వైపు మొగ్గుచూపిన ఎపి సెటిలర్లు తమ సొంత రాష్ట్రంలో ఓటు వేయడానికి వెళ్లటం, రుణమాఫీ ఆగస్టు 15న చేస్తామనే ప్రకటన, పంట నష్టం డబ్బులు పోలింగ్ ముందు రైతుల ఖాతాల్లో వేయడం, వంద రోజుల అభివృద్ధి కార్యక్రమాల అమలు లాంటి అంశాలు తమకు పెద్ద ఎత్తున లాభించబోతున్నాయని కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఎన్నికల కంటే పెరిగిన పోలింగ్ శాతం కాంగ్రెస్ వ్యతిరేక ఓటు బ్యాంకు అనీ, అది తమ వైపు నిలిచిందని బిజెపి నేతలు చెప్పుకుంటున్నారు. కాదు..కాదు...తమ పార్టీ ఎమ్మెల్యేలు ఛాలెంజ్‌గా తీసుకుని ఓటర్లను పోలింగ్ బూత్ వరకు రప్పించడంలో విజయవంతం అయ్యారనీ, ఆ ఓటింగ్ తమకు అనుకూలంగా పడ్డదనే ధీమాలో కాంగ్రెస్ అభ్యర్థులున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు లెక్కల మీద లెక్కలేసుకుంటూ నెత్తులు పీక్కుకుంటున్నా..అంతిమ ఫలితం కోసం జూన్ నాలుగో తేదీ వరకు వేచిచూడాల్సిందే. అప్పటి వరకూ ఈ టెన్షన్ పడాల్సిందే. పోలింగ్‌కు, ఫలితాల తేదీకి మధ్య ఇంత వ్యవధి ఉండటంతో ప్రజలు కూడా రిజల్ట్ కోసం ఇన్ని రోజులు వేచి చూడాలా? అంటున్నారు.

చెట్టును ఢీ కొట్టిన కారు

- వృద్ధ దంపతులు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా బోనకల్ - ముష్టికుంట గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును ఢీ కొట్టడంతో కారులో ఉన్న వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవింగ్ చేస్తున్న మనవడు, వృద్ధ దంపతులకు సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్, ఎన్టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెంగోళ్లు గ్రామానికి చెందిన కొత్తూరు సూర్యనారాయణ డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తూ కొన్నేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం భార్య రుక్మిణితో కలిసి ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో స్థిరపడ్డారు. వారికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులు ఒక్కొక్క నెల చొప్పున తల్లిదండ్రులను పోషిస్తున్నారు. దాంతో పాటు తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు ఆన్‌లైన్‌లో కేర్ టేకర్‌ను బుక్ చేసుకున్నారు. నాగరాజు అనే వ్యక్తి దంపతులకు నిత్యం సహాయకుడుగా ఉంటూ సేవలు అందిస్తున్నాడు. ఈ క్రమంలో మధిరలో చిన్న కుమారుడు గురు వెంకటేశ్వర్లు దగ్గర నెలరోజుల సమయం పూర్తి కావడంతో ఖమ్మంలో ఉంటున్న పెద్ద కుమారుడు విజయకుమార్ వద్దకు వెళ్లడానికి విజయ్ కొడుకు అనిల్ రావడంతో బుధవారం మధిర నుంచి అనిల్ తన కారులో తాత నానమ్మతో పాటు నాగరాజు కారులో బోనకల్ మీదుగా ఖమ్మం బయలుదేరారు. బోనకల్లు -ముష్టికుంట గ్రామాల మధ్య రాగానే కారు అదుపుతప్పి ప్రమాదవశాత్తు చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో

సూర్యనారాయణ, రుక్మిణి కారులోనే ప్రాణాలు కోల్పోయారు. అనిల్, నాగరాజు తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో వెళ్లారు. అదే సమయంలో బోనకల్ మాజీ ఎంపిపి తుళ్లూరు రమేష్ ఖమ్మం నుంచి బోనకల్లు వస్తున్నారు. ఆయన ప్రమాదాన్ని గమనించి కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఈ సమయంలోనే 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది అక్కడికి చేరుకొని కారు తలుపులను పగలగొట్టి సూర్యనారాయణ, రుక్మిణి మృతదేహాలతో పాటు అనిల్, నాగరాజును బయటకు తీశారు. అప్పటికే కారు ముందు భాగం నుంచి మంటలు వ్యాపిస్తూన్నా 108 సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని బయటకు తీశారు. ప్రాణాలతో ఉన్న అనిల్, నాగరాజులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. నాగరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. మధిర సిఐ దొంగరి మధు, బోనకల్ ఎస్ఐ కడగండ్ల మధుబాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు బంధువులకు సమాచారం అందించారు. బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.